సాక్షి
కాకినాడ
బుధవారం । 2 అక్టోబర్ । 2024



రూ.1,01,000 విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయం వద్ద నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి పేరిచర్ల సూర్యనారాయణరాజు (రాజమహేంద్రవరం) రూ.1,01,000 విరాళం అందజేశారు.



దోపిడీ దొంగల ముఠా అరెస్టు

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠా అమలాపురం రూరల్ పోలీసులకు పట్టుబడింది. నాలుగేళ్ల నుంచి పలు రాష్ట్రాల్లో 42 చోరీలు చేసిన ఈ ముఠాను పోలీసులు అరెస్టు చేసి బంగారు, వెండి వస్తువులను రికవరీ చేశారు. 10లో..

2.92 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 2,92,172 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.70 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 11,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌తో భేటీ

కాకినాడ రూరల్: జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు సీహెచ్ గణపతి సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగుల సాధారణ బదిలీలలో భాగంగా విశాఖపట్నం డీఐసీ జీఎంగా పనిచేస్తున్న ఆయన కాకినాడ జిల్లాకు వచ్చారు. రమణయ్యపేటలోని జిల్లా పరిశ్రమల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాకినాడ జిల్లాల ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు, ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

ఏలేరులో 85.52 మీటర్ల నీటి నిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఏలేరు ప్రాజెక్టులో నీటినిల్వలు స్వల్పంగా తగ్గాయి. దీంతో మంగళవారం నాటికి 85.52 మీటర్ల నీటినిల్వలు ఉన్నాయి. జలాశయం పరివాహక ప్రాంతం నుంచి 2,748 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టులో 86.56 మీటర్లకు గాను 85.52 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 22.00 టీఎంసీలకు నీటినిల్వలు చేరుకున్నాయి. దీంతో ఆయకట్టుకు 1,100, విశాఖకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా పంపా, తిమ్మరాజుచెరువుకు నీటి విడుదల నిలిపివేశారు.

రాత్రి గస్తీ ముమ్మరం

కాకినాడ క్రైం: జిల్లాలో రాత్రి గస్తీని ముమ్మరం చేసినట్టు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. దసరా పండుగ నేపథ్యంలో మరింత కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నామన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఉచితంగా అందిస్తున్న లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్ఎంఎస్)ను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్లేవారు ముందుగానే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి ఎల్‌హెచ్ఎంఎస్‌కు దరఖాస్తు చేసుకుంటే కెమెరాలతో కూడిన మానిటరింగ్ సిస్టంను ఇంటిలో ఉచితంగా ఇన్‌స్టాల్ చేస్తామన్నారు. ఇంటికి చేరే వరకు ఇంటి భద్రతను కంట్రోల్ రూం నుంచి భద్రతా విభాగం పర్యవేక్షిస్తుందని తెలిపారు.

98 శాతం ఇంటింటా ఓటర్ల తనిఖీ పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2025 రూపకల్పన కార్యకలాపాలపై మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈవో వివేక్ యాదవ్ అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షణ్మోహన్, ఎన్నికల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2025 రూపకల్పన కార్యకలాపాలకు సంబంధించి అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన ప్రక్రియ సక్రమంగా చేపడతామన్నారు. సెప్టెంబర్ 30 నాటికి జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,637 పోలింగ్ కేంద్రాల పరిధిలో 16,34,513 మంది ఓటర్లుగా ఉన్నారని వివరించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2025 రూపకల్పనలో భాగంగా ఈఏఆర్వోల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 98 శాతం ఇంటింటా ఓటర్ల తనిఖీ పూర్తి చేశామని కలెక్టర్ షణ్మోహన్ రాష్ట్ర ఎన్నికల సీఈవోకి వివరించారు. మార్పులు, చేర్పులు, మరణాలకు సంబంధించి 10,608 దరఖాస్తులు అందాయని, గడువులోపు పరిష్కరిస్తామని వివరించారు. జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

రెవెన్యూ అంశాలపై చర్చ

కాకినాడ సిటీ: రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా, సీసీఎల్ఏ, రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం సీసీఎల్ఏ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి జేసీ రాహుల్ మీనా, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఫ్రీ హోల్డ్ చేసిన భూముల పరిశీలన, ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు పరిష్కారం, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్ వంటి అంశాలపై ఆయన జేసీతో చర్చించారు. ప్రజల రెవెన్యూ సమస్యలను జిల్లా అధికారులు త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి అనగాని సూచించారు.

రీచార్జ్ చేస్తేనే వెలుగు



- జిల్లాలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కసరత్తు
- ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగం
- నివాస గృహాల్లోనూ అమర్చేందుకు యత్నాలు
- త్వరలోనే పాత విధానానికి మంగళం

కాకినాడ సిటీ: విద్యుత్‌శాఖ స్మార్ట్‌గా మారుతోంది. సెల్‌ఫోన్ మాదిరిగానే రీచార్జ్ చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుంది. లేదంటే కనెక్షన్ ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది. జిల్లాలో ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కసరత్తు వేగంగా జరుగుతోంది. ఇప్పటి వరకు వినియోగిస్తున్న పాత విద్యుత్ మీటర్ల స్థానంలో నూతనంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాత విధానం త్వరలోనే మరుగున పడనుంది.

ఏపీఈపీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసే దిశగా ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ ప్రక్రియలో నిరంతరం సరఫరా పొందాలంటే ముందే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. వాస్తవానికి ఇప్పటి వరకు ఇళ్లలో వినియోగించే మీటర్లు ఎలా ఉంటాయో తెలిసిందే. ఎంత మేరకు వినియోగించామనే అంశం యూనిట్ల రూపంలో మీటర్‌లో తెలుస్తుంది. నెలకు వాడిన యూనిట్లను లెక్కగట్టి విద్యుత్ బిల్లులను సంబంధిత రీడర్లు జారీ చేస్తారు. దీనికి సంబంధించిన మొత్తాన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు లేదా ఆన్‌లైన్ ద్వారా ఇప్పటి వరకు వినియోగదారులు చెల్లిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఇది పోస్ట్ పెయిడ్ తరహాలో ఉంటుంది.

ముందే చెల్లించాలి

రానున్న రోజుల్లో ఏర్పాటు చేయనున్న స్మార్ట్ మీటర్లు ప్రీ పెయిడ్ తరహాలో పని చేస్తాయి. అంటే నిర్ణీత మొత్తానికి రీ చార్జ్ చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుంది. మరోవైపు విద్యుత్ వాడకంపై యాప్‌లో ఎప్పటికప్పుడు నోటిఫికేషన్లు వస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో రాత్రి వేళ రీచార్జీ మొత్తం పూర్తయినా, మరుసటి రోజు ఉదయం వరకు విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఢోకా ఉండదు. తదుపరి రీచార్జ్ చేసుకున్న తరువాత వాడుకున్న మొత్తాన్ని అందులో నుంచి మినహాయిస్తారు.

తొలిసారిగా ప్రభుత్వ కార్యాలయాల్లో..

జిల్లాలో తొలిసారిగా కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇటీవల స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. అనంతరం పూర్తి స్థాయిలో అవగాహన వచ్చిన తర్వాత దశల వారీగా ప్రతి ఇంట్లోనూ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్నారు.

విద్యుత్ వినియోగం తగ్గించేందుకు..

విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాయి. కాకినాడ జిల్లాలో 5,59,330 రెసిడెన్షియల్ కనెక్షన్లు ఉండగా 37 వేల వరకు వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతి రోజూ దాదాపు 7.67 మిలియన్ల యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పటి వరకు కాకినాడ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లోను, పలు ఇళ్లల్లోను దాదాపుగా 2,500 స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ వినియోగాన్ని నియంత్రించేందుకు రాబోయే రోజుల్లో ఇళ్లలోనూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు.

కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు

డిస్కంలు నష్టాల ఊబిలో కూరుకుపోతుండటం మొండి బకాయిలు పేరుకుపోతుండటంతో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో దశల వారీగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు విద్యుత్ సంస్థలు కసరత్తు ప్రారంభించాయి.

ఎలా పని చేస్తుందంటే..

- ఇళ్లలో ప్రస్తుతం ఉండే మీటరుకు భిన్నంగా స్మార్ట్ మీటర్ పని తీరు ఉంటుంది.
- ముందుగానే రీచార్జ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్‌లో బ్యాలెన్సు ఎలా చూసుకుంటామో, ఇక్కడ అదే విధంగా యాప్‌లో చెక్ చేసుకోవచ్చు.
- బ్యాలెన్స్ ఉన్నంత వరకే విద్యుత్ సరఫరా ఉంటుంది. నగదు అయి పోయిన వెంటనే సరఫరా నిలిచిపోతుంది. దీంతో రీచార్జ్ చేస్తేనే విద్యుత్ వెలుగు. బ్యాలెన్స్ ఎంత ఉందో తెలియజేస్తూ నోటిఫికేషన్లు వస్తుంటాయి.

నష్టాలు ఇలా..

- విద్యుత్ సంస్థను నమ్ముకొని ఎన్నో ఏళ్లుగా మీటర్ రీడర్లు పని చేస్తున్నారు. ఈ విధానం పూర్తి స్థాయిలో అమలైతే వారి ఉపాధికి పెద్ద దెబ్బేనని చెప్పొచ్చు.
- అవగాహన లేమితో రీచార్జ్ చేసుకోవడంలో వినియోగదారులు ఏ మాత్రం అలసత్వం వహించినా, సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం ఉంటుంది.
- విద్యుత్ చౌర్యం పెరిగే అవకాశం ఉంది. లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



ఓ ఇంటికి బిగించిన స్మార్ట్ మీటర్

ప్రజలకు ఇబ్బంది



విద్యుత్‌శాఖ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ మీటర్ల వల్ల ఏ సమయంలో విద్యుత్ ఆగిపోతుందో తెలియని పరిస్థితి ఉంటుంది. ముందుగానే సెల్‌ఫోన్ మాదిరిగా రీచార్జ్ చేయించుకోవాలంటే సామాన్య ప్రజలకు తెలియదు. ఎంత సొమ్ము రీచార్జ్ చేస్తే ఎంత కాలం వస్తుందో వారికి తెలియదు. ఒకేసారి బ్యాలెన్స్ అయిపోతే విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రజల్లో ఇప్పటికే స్మార్ట్ మీటర్ల వల్ల ఆందోళన పెరిగింది. దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారు.

– మండవ సమాధానం, వీస్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు, తూరంగి

ప్రభుత్వం పునరాలోచించాలి



స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ముందుగానే రీచార్జి అంటే ప్రజలకు బ్యాలెన్స్ ఉన్నంత వరకే విద్యుత్ సరఫరా ఉంటుంది. నగదు అయిపోయిన వెంటనే సరఫరా నిలిచిపోతుంది. రీచార్జ్ చేస్తేనే విద్యుత్ వెలుగు అని అధికారులే చెబుతుండడంతో ప్రజలు విద్యుత్ వినియోగంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దని ఇప్పటికే గ్రామాల్లో ప్రజలు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లకు అమర్చిన స్మార్ట్ మీటర్లకు బిల్లులు రాకపోవడంతో రెండు, మూడు నెలలకు కూడా ఒకేసారి కట్టాల్సిన పరిస్థితులను ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఈ విధానం పునరాలోచించాలి.

– ఏనుగుపల్లి కృష్ణ, మాలమహానాడు నాయకులు, కాకినాడ

జమిలి ఎన్నికలు రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

మాజీ ఎంపీ మిడియం బాబూరావు



జమిలి ఎన్నికలపై నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బాబూరావు

కాకినాడ సిటీ: తాజాగా కేంద్ర కేబినెట్ ఆమోదించిన జమిలి ఎన్నికల విధానం భారత రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని మాజీ పార్లమెంటు సభ్యులు మిడియం బాబూరావు అన్నారు. సోమవారం రాత్రి కాకినాడ కచేరిపేట యూటీఎఫ్ హోంలో రఘుపతి వెంకటరత్నంనాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జమిలి ఎన్నికలు–పర్యవసానాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఐ ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో బాబూరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో జమిలి ఎన్నికల గురించి వేసిన కమిటీ 1,200 పేజీలకు పైగా నివేదిక ఇచ్చిందన్నారు. తరచూ ఎన్నికల నిర్వహణ వల్ల నిధుల ఖర్చు, సమయం వృధా వంటి విషయాలు పేర్కొనడం శోచనీయమన్నారు. దేశ బడ్జెట్‌లో ఎన్నికల వ్యయం చాలా నామమాత్రంగా ఉంటుందన్నారు. ఎన్నికైన పాలకులకు 60 నెలల సమయం ఉంటే అన్ని రకాల ఎన్నికలకు 3 నెలలు సరిపోతుందని, ప్రభుత్వ నిర్వహణకు 57 నెలలు సరిపోదా అని ప్రశ్నించారు. కేంద్ర పాలకులు ఎన్నికల కమిషన్ స్వతంత్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గడచిన ఎన్నికల్లో బీజేపీ 400 స్థానాలు గెలిచి ఉంటే, పాలన వారి ఇష్టారాజ్యంగా ఉండేదన్నారు. బీజేపీ ప్రమాదాన్ని గమనించి దేశ ప్రజలు 2024 ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారన్నారు. జమిలి ఎన్నికల వల్ల రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి దెబ్బ తింటుందన్నారు. అనేక రాజ్యాంగ సవరణలు చేయాల్సి వస్తుందన్నారు. దేశంలో ప్రజలు నిరుద్యోగం, అధిక ధరలు, పౌష్టికాహార లేమి, అనారోగ్యం, అవిద్య వంటి సమస్యలతో బాధపడుతుంటే వాటి గురించి ఆలోచించకుండా ప్రజలను గందరగోళ పరిచే విధానాలకు బీజేపీ పూనుకుంటుందని బాబూరావు విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ప్రజాసంఘాలు స్పందించాలని కోరారు. ఈ సదస్సుకి సీఐటీయూ నగర కన్వీనర్ మలక వెంకటరమణ,, ఆర్‌వీఎన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్ గోవిందరాజు పాల్గొన్నారు.

జాలీ డేస్

- ఇక సెలవులే సెలవులు
- విద్యార్థులకు దసరా పండగే
- నేడు గాంధీ జయంతి సెలవు
- మూడు నుంచి 12 వరకు దసరా సెలవులు
- 13న ఆదివారం సెలవు 14న తిరిగి పునఃప్రారంభం
- సంతోషంలో పాఠశాల విద్యార్థులు
- జిల్లాలో 3,010,13 మంది విద్యార్థులు
- జిల్లాలో 1282 , ప్రభుత్వ, 573 ప్రైవేటు పాఠశాలలు



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పాఠశాలలకు బుధవారం నుంచి సెలవులు. గురువారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకూ ప్రభుత్వం దసరా సెలవులు ఇచ్చింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వం ప్రకటించిన సెలవుల షెడ్యూల్‌ను అనుసరించాలి. కాగా అక్టోబరు 2 బుధవారం గాంధీ జయంతి సెలవు దినం కావడంతో బుధవారం నుంచే పాఠశాలలకు సెలవులు వర్తించనున్నాయి. జిల్లాలో మొత్తం 3లక్షల10వేల13 మంది విద్యార్థులు ఉన్నారు. వీటిలో ప్రభుత్వ పాఠశాలలు 1,282 కాగా ప్రైవేట్ పాఠశాలలు 573 ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ సెలవులు వర్తిస్తాయి. ఈసారి దసరా సెలవుల్లో రెండో శనివారం, ఆదివారం కలిపి మొత్తం 11 సెలవు దినాలు వస్తున్నాయి. సెలవులు 10 రోజుల కంటే తక్కువ, 15 రోజుల కంటే ఎక్కువ వచ్చిన సందర్భాల్లో ఉపాధ్యాయులు అత్యవసర పరిస్థితుల్లో పాఠశాల మూసివేసే రోజు, లేదా పాఠశాల ప్రారంభించే రోజుల్లో ఏదో ఒక రోజు సెలవు పెట్టుకునే అవకాశం ఉంటుంది. ఈసారి ప్రకటించిన సెలవులు 12వ తేదీ రెండో శనివారం, 13వ తేదీ ఆదివారం కలిపి 11 రోజులు ఉన్నందున పాఠశాల మూసివేసే రోజు లేదా ప్రారంభం రోజున సెలవు వాడుకునే అవకాశం ఉండదు. అందువలన దసరా సెలవుల ముందు రోజు గాంధీ జయంతి కావడంతో మంగళవారం, సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమయ్యే ఈ నెల 14వ తేదీ సోమవారం ఉపాధ్యాయులు పాఠశాలలకు తప్పనిసరిగా హాజరు కావాల్సిందే. ఒకవేళ విధి లేని పరిస్థితుల్లో ఉపాధ్యాయుడు సెలవు పెడితే దసరా సెలవులు 12 రోజులు వారి వ్యక్తిగత సెలవుల కిందకు వస్తాయి. ఆ ఉపాధ్యాయుడికి అర్హత ఉన్న సెలవుల నుంచి వీటిని తగ్గించే అవకాశముంది.

155 మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతి

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా వ్యాప్తంగా 155 మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కృష్ణకుమారి తెలిపారు. ఈ మేరకు, మంగళవారం సాయంత్రం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 2024–26 రెండేళ్ల వ్యవధికి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రకటించిందన్నారు. కాకినాడ జిల్లా గెజిట్ 70/2024ను అనుసరించి ఈ నెల 1 నుంచి 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ లేదా హైబ్రీడ్, ఆఫ్‌లైన్ పద్ధతుల ద్వారా దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు. ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేవారు సంబంధిత స్టేషన్లలో తమ దరఖాస్తులు సమర్పించాలని వెల్లడించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి అనుకునేవారు హెచ్‌టీటీపీ: హెచ్‌పీఎఫ్ ఎస్‌ప్రాజెక్టు.డాట్‌కామ్ వెబ్‌సైట్‌కి లాగిన్ అయి తమ దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈ నెల 11వ తేదీన లాటరీ పద్ధతి ద్వారా కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న వివేకానంద హాల్‌లో కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ విధానంలో దుకాణాల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని కృష్ణకుమారి తెలిపారు. దరఖాస్తుదారులు నిర్దేశించిన మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీ, మండలాల యూనిట్లలో నోటిఫై చేసిన షాపులకు రూ.2 లక్షలు నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలంటూ నిరసన దీక్షలు చేపట్టిన విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు

కాకినాడ సిటీ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలంటూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. ఈ దీక్షా శిబిరాలను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, సీహెచ్ రాజకుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, పెదిరెడ్డి సత్యనారాయణ దీక్షా శిబిరంలో కూర్చున్న ఆందోళనకారులకు దండలు వేసి దీక్షలు ప్రారంభించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని, ఉద్యోగుల బలవంతపు బదిలీలు తక్షణం నిలుపుదల చేయాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, సొంత గనులు కేటాయించాలని, విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ 32 మంది బలిదానాలతో ఏర్పడిందని, అలాంటి సంస్థను ప్రైవేటీకరణ చేయడం దురదృష్టకరమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ వల్ల సుమారు 20 లక్షల కుటుంబాలు బతుకుతున్నాయన్నారు. దేశ సంపదని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ప్రైవేటీకరణ ఆపకుంటే ఉమ్మడి ప్రజా సంఘాలు కార్యాచరణ సిద్ధం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు వై.బాబి, ఎం. గంగాసూరిబాబు, బులిరాజు, శ్రీకాంత్, దుర్గాప్రసాద్, మణికంఠ, చిన్ని, లోరాజు, అమృత, సూర్య, ఎం వీబాబు, జామి సింహాద్రి పాల్గొన్నారు.

రత్నగిరిపై రేపటి నుంచి దసరా వేడుకలు

- తొమ్మిది రోజులపాటు అమ్మవార్లకు కుంకుమ పూజలు
- విజయదశమి రోజు చండీహోమం పూర్ణాహుతి, సాయంత్రం శమీపూజ
- పూజలలో పాల్గొననున్న 60 మంది రుత్విక్కులు
- రోజుకో అవతారంలో దర్శనమివ్వనున్న వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి ఆలయం

అన్నవరం : రత్నగిరి శ్రీసత్యదేవుని సన్నిధిన శరన్నవరాత్ర వేడుకలు (దసరా ఉత్సవాలు) ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి, అక్టోబర్ మూడో తేదీ గురువారం నుంచి అక్టోబర్ 12వ తేదీ, శనివారం, విజయదశమి పర్వదినం వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ మంగళవారం తెలిపారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవుని ఆలయంలో పండితులు కలశ స్థాపన చేసి దసరా వేడుకలకు అంకురార్పణ చేస్తారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కుంకుమ పూజలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించే 44 మంది రుత్విక్కులు 16 మంది అర్చక స్వాములకు అధికారులు దీక్షా వస్త్రాలు అందజేస్తారని అధికారులు తెలిపారు.

ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుంచి విజయదశమి వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ రుత్విక్కులు సత్యదేవుని ఆలయంలో స్వామి, అమ్మవారు, రామాలయంలో సీతారాములకి, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు శ్రీ సూక్త, పురుషసూక్త, మన్యుసూక్త పారాయణలు, లలితా, విష్ణు సహస్ర నామావళి పారాయణ, లింగార్చన, నవావరణ అర్చన, సూర్యనమస్కారాలు నిర్వహిస్తారు. యంత్రాలయంలోని శ్రీమహా వైకుంఠ నారాయణవిభూతి యంత్రానికి రుత్విక్కులు పూజలు చేస్తారని అధికారులు తెలిపారు. ప్రధానాలయంలో గల శివలింగానికి అభిషేకాలు నిర్వహిస్తారు. రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి సత్యదేవుని ఆలయం, దర్బారు మంటపం, రామాలయం, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్ల ఆలయాలలో రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహిస్తారు. అనంతరం అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదన చేస్తారు. రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు సత్యదేవుని ప్రధానాలయంలో రుత్విక్కులు, అర్చకస్వాములు దర్బారు నిర్వహించి నాలుగు వేదాలు, పంచ కావ్యాలు పఠిస్తారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేస్తారు.

రోజుకొక అవతారంలో..

దసరా ఉత్సవాల పది రోజులు రోజుకొక అలంకరణలో వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను అలంకరించి పూజిస్తారు. దుర్గాష్టమి నాడు చండీహోమం ప్రారంభించి మహర్నవమినాడు కొనసాగిస్తారు. విజయదశమి పర్వదినం రోజు చండీహోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం కొండ దిగువన శమీపూజ నిర్వహిస్తారు.

క్లుప్తంగా

వాహనం ఢీకొని ఇద్దరి మృతి


ప్రమాదంలో మృతి చెందిన మహేష్


మృతుడు కరీముల్లా (ఫైల్)

రంగంపేట: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందినట్టు ఎస్‌ఐ తోట కృష్ణసాయి తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిడదవోలు వైఎస్సార్ కాలనీకి చెందిన పడాల మహేష్ (29), రాజమహేంద్రవరం మంగళవారపుపేటకు చెందిన సయ్యద్ కరీముల్లా (29) ఇద్దరూ కలసి పల్సర్ బైక్‌పై కాకికాడ వెళ్తున్నారు. మహేష్‌కు చెందిన లారీ కాకినాడలో ఉందని దానిని తీసుకురావడానికి వెళ్తుండగా రంగంపేట మండల పరిధిలోని కోటపాడు, రామేశంపేట గ్రామాల మధ్య ఏడీబీ రోడ్డులో గుర్తు తెలియని వాహనం వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను బలంగా ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మహేష్, కరీముల్లా అక్కడికక్కడే మృతి చెందారు. కరీముల్లా తలపై నుంచి వాహనం చక్రాలు వెళ్లిపోవడంతో తల భాగం ఛిద్రమైపోయింది. మహేష్ తల వెనుక భాగంలో తీవ్ర గాయం కావడంతో సంఘటనా స్థలంలోనే వారు మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పెన్షన్ సొమ్ము కోసం వృద్ధురాలిపై దాడి

- ఇంటి దగ్గర దింపుతానని నమ్మించి బైక్‌పై నుంచి తోసేసి నగదుతో పరారు
- పట్టుకునేందుకు స్థానికుడి విఫలయత్నం
- విషయం తెలుసుకున్న కమిషనర్ సొంత సొమ్ము రూ.4 వేలు అందజేత

పిఠాపురం: పింఛన్ సొమ్ముతో వస్తున్న ఒక వృద్ధురాలిపై దాడి చేసి నగదతో ఉడాయించిన ఘటన పిఠాపురంలో మంగళవారం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగ్గయ్య చెరువు గొల్లపేటకు చెందిన గోపాలపు అనంత లక్ష్మి ఒకటో తేదీ కావడంతో 11వ సచివాలయం నుంచి పెన్షన్ తీసుకుని తన ఇంటికి వెళ్తోంది. ఇంతలో రోడ్డుపై నడిచి వెళుతున్న ఆమెను వెంబడించిన ఒక అగంతకుడు మీ ఇంటి వైపే వెళ్తున్నా దింపుతానని చెప్పి బైక్ ఎక్కించుకున్నాడు. అక్కడ నుంచి ఎంపీడీవో కార్యాలయం వెనుక వీధిలో ఎవరూలేని రోడ్డులోకి వెళ్లాకా ఒక్క సారిగా బండిపై ఉన్న వృద్ధురాలిని బైక్‌పై నుంచి కిందకు నెట్టడంతో ఆమె కిందపడిపోయింది. ఆమె వద్ద ఉన్న రూ.4 వేలు పట్టుకుని బైపాస్ రోడ్డు వైపు బైక్‌తో దుండగుడు పరారయ్యాడు. ఇది గమనించిన స్థానికుడు స్కూటీతో వెళ్లి పట్టుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వృద్ధురాలిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యసేవలందిస్తున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ కనకారావు తన సొంత సొమ్ము రూ.4వేలు ఆమెకు అందించారు. సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఖరీఫ్ తరువాతే పంపాకు మరమ్మతులు

- బలహీనంగా నాలుగో నంబర్ గేటు
- ప్రస్తుతానికి తాత్కాలిక మరమ్మతులు
- అనంతరం పూర్తిస్థాయి నిల్వకు అవకాశం

అన్నవరం: సాధారణంగా ఒక నదిపై బ్యారేజీ లక్ష్యమేంటంటే వర్షాకాలంలో కురిసిన వర్షపునీరు ఆ బ్యారేజీలో పూర్తి స్థాయి లో నిల్వ చేసి వర్షాలు లేని సమయంలో సాగునీరు, తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతుందనే. అయితే అన్నవరంలోని పంపా రిజర్వాయర్ బ్యారేజీ గేట్లు బలహీనంగా ఉండడంతో రిజర్వాయర్‌లోకి ఎంత నీరు వచ్చినా సగం నీరు సముద్రంలోకి వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బ్యారేజీలో నాలుగో నెంబర్ గేటు బలహీనంగా ఉండడంతో ఆ గేటుకు మరమ్మత్తులు పూర్తి చేసేవరకు పూర్తి స్థాయిలో నీరు నిల్వ చేయవద్దని, 99 అడుగుల వద్ద మాత్రమే నీటి మట్టం ఉంచాలని ఉన్నతాధికారులు సూచించారు. దీంతో రెండు నెలలుగా ఆ మేరకు నీటిమట్టాన్ని ఉంచి మిగిలిన నీటిని దిగువకు వదిలేస్తున్నారు. పంపా రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 103 అడుగులు. అయితే ఐదు అడుగులకు తక్కువగా నీటిమట్టం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పంపా ప్రాజెక్టుకు 55 ఏళ్లు

పంపా రిజర్వాయర్ నిర్మించి దాదాపు 55 ఏళ్లు పూర్తయింది. అప్పుడు బ్యారేజీకి ఏర్పాటు చేసిన ఐదు గేట్లకు ఎప్పటి కప్పుడు తాత్కాలిక మరమ్మత్తులు మాత్రమే చేస్తున్నారు. గత ఆగస్టులో కర్నాటకలోని తుంగభద్ర ప్రాజెక్టు గేటు ఊడిపోవడంతో తాత్కాలికంగా మరో గేటు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణులు ప్రాజెక్టుకు గేట్లు ఏర్పాటు చేసి 40 ఏళ్లు పూర్తయితే కొత్త గేట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పంపా ప్రాజెక్టుకు కూడా గేట్లు మార్చాలని గతంలోనే నిపుణులు సూచించినా నిధుల సమస్యతో తాత్కాలిక మరమ్మత్తులు మాత్రమే చేస్తున్నారు.


పంపా బ్యారేజీ నాలుగో నెంబర్ గేటు నుంచి నీరు సముద్రానికి విడుదల చేస్తున్న దృశ్యం


బ్యారేజ్ గేట్లు ఎత్తే యంత్రాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గత నెలలో తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురియడంతో పెద్ద ఎత్తున వరదనీరు పంపాకు తరలివచ్చింది. అయినప్పటికీ నిల్వచేసుకునే పరిస్థితి లేక 99 అడుగులకు మించి నీరు ఉంచకుండా సముద్రంలోకి విడుదల చేస్తున్నట్టు ఈఈ శేషగిరిరావు సాక్షికి తెలిపారు.

నాలుగు సార్లు నిండితేనే ఆయకట్టుకు నీరు..

పంపా రిజర్వాయర్ కింద తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని 12,500 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఒక సారి ఆయకట్టు మొత్తం సాగవ్వాలంటే 1.5 టీఎంసీల నీరు అవసరం. పంపా గర్భంలో నుంచి పుష్కర కాల్వ నిర్మాణం జరుగక ముందు పంపా రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 105 అడుగులు ఉండేది. అంటే 0.5 టిఎంసీల నీరు నిల్వ ఉంటుంది. అయితే పుష్కర కాల్వ రిజర్వాయర్‌కు 103 అడుగుల ఎత్తులో నిర్మించిన తరువాత రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 103 అడుగులకు అంటే 0.44 టిఎంసీలకు పరిమితం చేశారు. ఇప్పుడు పంపా బ్యారేజీ గేట్లు బలహీనంగా ఉండడం వలన 99 అడుగులకే పరిమితం చేయడంతో రిజర్వాయర్ నీటి నిల్వ 0.26 టిఎంసీకి పరిమితమైంది. దీంతో ఖరీఫ్ పంట కాలంలో నాలుగు సార్లు పంపా నిండితే తప్ప ఖరీఫ్ గట్టెక్కని పరిస్థితి. అయితే పుష్కర నుంచి కూడా పంపా రిజర్వాయర్‌కు నీరు విడుదల అవుతున్నందున సాగు నీటి సమస్య ఉండడం లేదు. ఒకవేళ పుష్కర నీరు రాకపోతే ఆయకట్టు సాగు ప్రశ్నార్థకమవుతుంది.

గత జూలైలో తాత్కాలిక మరమ్మతులు

గత జూలై మొదటి వారంలో గోదావరి డెల్టా ఇంజినీరింగ్ చీఫ్ సురేష్ కుమార్, ఎస్ఈ జి.శ్రీనివాసరావు పంపా బ్యారేజీ పరిశీలించి ఈఈ శేషగిరిరావుతో గేట్ల పరిస్థితిపై చర్చించారు. దీంతో అత్యవసరంగా గేట్లకు మరమ్మతులు చేయాలని సురేష్‌కుమార్ ఆదేశించడంతో సుమారు రూ.30 లక్షలతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేశారు. ఇందులో భాగంగా నాలుగు గేట్లు కు రబ్బర్ సీల్స్, బ్లాక్ గ్రీజు ఏర్పాటు, కొత్త ఐరన్ రోప్‌లు ఏర్పాటు చేసి పాడైన నాలుగో నంబర్ గేటు రేకు సగం పాడవడంతో దాని స్థానంలో కొత్త రేకు అమర్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఇంతలో జూన్ చివరి వారంలో వర్షాలు ప్రారంభమై వరదలు రావడంతో మరమ్మతులకు అవాంతరం ఏర్పడింది. ఈ మరకు మంగళవారం ఈఈ శేషగిరిరావు మంగళవారం మాట్లాడుతూ 4వ నంబరు గేటు మినహా మిగిలిన గేట్లకు మరమ్మతులు చేశామని

పంపా బ్యారేజీ 1,2,3,5 నెంబర్ గేట్లుకు మరమ్మత్తులు చేశారని ఈఈ శేషగిరి రావు మంగళవారం సాక్షికి తెలిపారు. నాలుగో నంబరు గేటుకు మాత్రం ఖరీఫ్ అనంతరం మరమ్మత్తులు చేయిస్తామని ఆయన వివరించారు.

కాగా పంపా గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేసి 103 అడుగులకు నీటిని నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని రైతులు కోరుతున్నారు.

గేట్లు బలహీనంగా ఉండడం వల్లే తరుచూ మరమ్మతులు

పంపా బ్యారేజీ గేట్లను అప్పటి సాంకేతికత ప్రకారం అర్ధచంద్రాకారంగా (వర్టికల్) నిర్మించారు. ఆ వంపు వల్ల నిర్వహణ సమయంలో ఇబ్బంది ఎదురవుతోందని అధికారులు చెప్తున్నారు.

గత ఏడాది డిసెంబర్‌లో ఇలాగే భారీ వర్షాల సమయంలో బ్యారేజీ గేట్లు ఎత్తినపుడు నాలుగో నెంబర్ గేటు కిందకు దిగకపోవడంతో దానిని బలవంతంగా కిందకు దించాల్సి వచ్చింది. భవిష్యత్‌లో ఇటువంటి సమస్యలు రాకుండా ఉండేందుకు గేట్లు మార్చాలని అధికారులు నిర్ణయించారు. కాగా ఈ ఖరీఫ్ సీజన్ వరకు గేట్లుకు తాత్కాలిక మరమ్మత్తులు చేసి అనంతరం గేట్లు మార్చాలని నిర్ణయించారు.

99 అడుగులకు నీరు పరిమితం



పంపా రిజర్వాయర్ గరిష్ట నీటి నిల్వ 103 అడుగులు వద్ద 0.44 టీఎంసీ నిల్వ ఉంటుంది. అయితే బ్యారేజీ గేట్లలో నాలుగో నెంబర్ గేటు పరిస్థితి బలహీనంగా ఉండడంతో నీటి నిల్వను 99 అడుగుల కు పరిమితం చేస్తున్నాం. పూర్తిస్థాయి మరమ్మతులు అయ్యే వరకు రైతులు సహకరించాలని కోరుతున్నాం.

– శేషగిరిరావు, ఈఈ

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠా అరెస్టు

- రూ.70 లక్షల బంగారు, వెండి వస్తువుల స్వాధీనం
- కిమ్స్ వెంకటేశ్వర ఆలయంలో చోరీ సొత్తు రికవరీ
- ఘటన జరిగి నెల తిరక్కుండానే ముఠా పట్టివేత
- నాలుగేళ్లలో మూడు రాష్ట్రాల్లో 42 చోరీలు

అమలాపురం టౌన్: అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠా అమలాపురం రూరల్ పోలీసులకు పట్టుబడింది. నాలుగేళ్ల నుంచి మన రాష్ట్రంతో పాటు ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో 42 చోరీలు చేసిన ఈ ముఠాను అమలాపురం రూరల్ పోలీసులు అరెస్టు చేసి భారీ ఎత్తున బంగారు, వెండి వస్తువులను రికవరీ చేశారు.

తీగ లాగితే డొంక కదిలినట్టు అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలోని వేంకటేశ్వర ఆలయంలో గత నెల 4వ తేదీన ఈ ముఠా చోరీకి పాల్పడి రూ.70 లక్షల విలువైన 868 గ్రాముల బంగారు, 8.56 కిలోల వెండి వస్తువులను దోచుకుంది. ఆ సొత్తు మొత్తాన్ని రికవరీ చేసినట్టు పోలీసు అధికారులు వెల్లడించారు. చోరీ జరిగి నెల రోజుల తిరక్కుండానే ముఠాను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు, ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ముఠా చోరీల చిట్టాను వివరించి రికవరీ చేసిన సొత్తును ప్రదర్శించారు.


స్వాధీనం చేసుకున్న రూ.70 లక్షల సొత్తును ప్రదర్శించి అరెస్ట్ చేసి అంతర్రాష్ట్ర ముఠా వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణారావు. చిత్రంలో జిల్లా పోలీసు అధికారులు, దర్యాప్తు బృందం సీఐలు, ఎస్సైలు

నలుగురి సభ్యుల ముఠా అరెస్టు

ఈ చోరీకి పాల్పడిన శ్రీకాకుళం జిల్లా గుర్రాల మెట్ట శివారు గార్లపాడు గ్రామానికి చెందిన సవర సూర్యం, సవర చిన్నారావు, శ్రీకాకుళం జిల్లా జోగివలస గ్రామానికి చెందిన సవర రజని, తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాకు చెందిన ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా కారిగూడ గ్రామ నివాసి బత్తిని శ్రీకాంత్‌లను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ముఠా శ్రీకాకుళం జిల్లాలో 37, విశాఖ నగరంలో ఒకటి, ప్రకాశం జిల్లాలో ఒకటి, గుంటూరు జిల్లాలో ఒకటి, తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాలో ఒకటి, ఒడిశా రాష్ట్రంలో ఒక చోరీకి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

ఈ ముఠాలో మొత్తం 19 మంది సభ్యులుగా ఉన్నట్లు గుర్తించారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ ముఠా చేసిన చోరీలో రూ.50 లక్షలు సొత్తు కాజేసినట్లు దర్యాప్తులో గమనించారు. దర్యాప్తులో భాగంగా ముఠాలో మిగిలిన సభ్యుల వివరాలు సేకరించి శ్రీకాకుళం జిల్లా పోలీసులకు సమాచారం అందించారు.

దర్యాప్తు బృందానికి రివార్డులు

ఈ చోరీ కేసును దర్యాప్తు చేసి నెల రోజుల్లోపే నిందితులను పట్టుకుని, నూరు శాతం సొత్తును రికవరీ చేసిన పోలీసు బృందాన్ని ఎస్పీ కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించి వారికి రివార్డులను ప్రదానం చేశారు. చోరీ కేసు దర్యాప్తు, సొత్తు రికవరీలో పోలీసు అధికారులతోపాటు జిల్లా పోలీస్ ఐటీ కోర్ ప్రతినిధి జాఫర్, జిల్లా క్రైమ్ పార్టీ కానిస్టేబుళ్లు అరిగెల శుభాకర్, లంకాడి శ్రీనివాస్, బొక్కా దుర్గా ప్రసాద్, కేతా రమణ, అర్జునరావు, హరిబాబు, చిన్న ప్రసాద్‌లు కూడా కీలకంగా వ్యవహరించారు. వీరికి కూడా జిల్లా ఎస్పీ కృష్ణారావు రివార్డులు అందించారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు, రూరల్ ఎస్సై వై.శేఖర్‌బాబు, సీఐ డి.ప్రశాంత్‌కుమార్, క్రైమ్ ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, క్రైమ్ పార్టీ హెచ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

జల్సాలకు అలవాటు పడి.. ముఠాకట్టి..

ముఠాలోని సభ్యులంతా జల్సాలకు అలవాటు పడి చెడు వ్యసనాల బాట పట్టి ముఠా కట్టినవారే. 2012 సంవత్సరం నుంచి ఈ ముఠా మూడు రాష్ట్రాల్లో చోరీలు చేస్తున్నా ఎప్పుడూ పోలీసులకు పట్టుబడలేదు. తాజాగా వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీకి పాల్పడ్డ ఈ ముఠాను ఆధునిక సాంకేతికతతో స్థానిక పోలీసులు పట్టుకున్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

ఎస్పీ కృష్ణారావుకు బాధితుల ఫిర్యాదు


ఫిర్యాదు చేసేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బాధితులు

అమలాపురం టౌన్: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని తమ వద్ద రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేసి రెండేళ్ల నుంచి తిప్పించుకుంటున్నారని బాధితులు ఎస్పీ కృష్ణారావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. అల్లవరం మండలానికి చెందిన సబ్బతి సుజన్ మరో వ్యక్తితో కలిసి తమను మోసం చేశాడని దాదాపు 10 మంది బాధితులు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయనకు వివరించారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలు, రావుల పాలెం, అంబాజీపేట, అప్పనపల్లి గ్రామాలకు చెందిన బాధితులు తమకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని తమ వద్ద నుంచి రూ.20 లక్షల వరకూ తీసుకున్నారని వారు తెలిపారు. సబ్బతి సుజన్‌కు శ్రీధర్ అనే వ్యక్తి కూడా తోడై తమను మోసం చేశాడని బాధితులు ఆరోపించారు. నిందితుడు సుజయ్‌ది అల్లవరం మండలం కావడంతో ఆ మండల పోలీస్ స్టేషన్‌లో ఈ కేసును దర్యాప్తు చేయాల్సిందిగా ఎస్పీ కృష్ణారావు డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబు, ఎస్సై హరీష్‌కుమార్‌ను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

అమలాపురం రూరల్: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులు మెల్లం భువన సాత్విక, బొంతు అస్మిని (స్టాండ్ బై) ఎంపికయ్యారని హెచ్‌ఎం గుంట్రు వెంకటేశ్వరరావు తెలిపారు. కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–17 వాలీబాల్ జిల్లాస్థాయి పోటీలో భువన సాత్విక ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైందని తెలిపారు. విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఆమె పాల్గొంటుందని తెలిపారు.

కిర్లంపూడి నుంచి ఇద్దరు..

కిర్లంపూడి: తామరాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం కాకినాడలో నిర్వహించిన క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అండర్–17 విభాగంలో కె.అజయ్, అండర్–14 విభాగంలో కె.జయరాజు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎల్.కృష్ణ తెలిపారు.

కబడ్డీ పోటీలకు

జగ్గంపేట: రాష్ట్రస్థాయి క్రీడలకు జగ్గంపేట హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు స్కూల్ హెచ్‌ఎం టీవీఎస్ రంగారావు తెలిపారు. అండర్ 14 కబడ్డీ విభాగంలో సీహెచ్ పుష్ప, బి.రత్నకుమారి, సీహెచ్ రితిక జ్యోతి, జి శశాంక్, డి.దుర్గాప్రసాద్ ఎంపిక కాగా, అండర్ 17 కబడ్డీ విభాగంలో ఎం.శ్యామ్, ఎ.గంగాభవాని, పవర్ లిఫ్టింగ్ విభాగంలో పి.రాణి, కె.ప్రసన్న కుమార్ ఎంపికైనట్టు తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను పీడీ బి.మురళీకుమార్, బి.నీలకంఠేశ్వరరావు, ఉపాధ్యాయులు కృష్ణ మోహన్, మూర్తి, హుస్నారా బేగం తదితరులు అభినందనలు తెలిపారు.


క్రీడలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆడపిల్ల పుట్టిందని చంపేశాడు

- 34 రోజుల శిశువును గొంతు నులిమి చంపేసిన తండ్రి
- కాకినాడ జగన్నాథపురంలో హృదయ విదారక ఘటన

కాకినాడ క్రైం: ఆడపిల్లగా జన్మించడమే ఆ శిశువుపాలిట మరణ శాసనమైంది. ఆడపిల్ల భారం మోయలేనంటూ అమ్మిస్తానని భార్యతో చెప్పడంతో ఆమె వద్దన్న పాపానికి రక్తం పంచి కన్న తండ్రే ఆ శిశువును కడతేర్చాడు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జగన్నాథపురం పప్పుల మిల్లు ప్రాంతానికి చెందిన చెక్కా భవానీ కొన్ని సంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో కేతా శివమణి అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. వీరికి కొన్నేళ్ల క్రితం బాబు జన్మించాడు. శివమణి ఆ బాబును విక్రయించాడు. వీరికి 34 రోజుల క్రితం మరో ఆడ శిశువు జన్మించింది. అప్పటి నుంచి శివమణి ఆడపిల్ల పుట్టిందని అసంతృప్తితో ఉన్నాడు. ఆడపిల్ల తనకు భారమంటూ భవానీతో నిత్యం గొడవ పడుతూ ఉండేవాడు. దీనిలో భాగంగా బుధవారం రాత్రి భార్య వద్దకు వచ్చి బేరం కుదిరిందని బిడ్డను అమ్మేస్తానని భవానీతో చెప్పుకొచ్చాడు. దీనికి కంగుతిన్న ఆమె శివమణి తీరును తప్పుబట్టింది. బిడ్డను అమ్మేందుకు అంగీకరించేది లేదని తెగేసి చెప్పింది. ఈ నేపథ్యంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఇదిలా జరుగుతుండగానే నిద్రపోతున్న శిశువును చేతితో అందుకున్న తండ్రి బలంగా శిశువు గొంతు నులిమి గోడకు కొట్టాడు. అప్పటికే అచేతనంగా పడిఉన్న శిశువును తల్లి స్థానికుల సాయంతో కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువచ్చింది. కొన ప్రాణాలతో ఆసుపత్రిలో చేరిన కాసేపటికే శిశువు మృతి చెందింది. ఘటనపై సమాచారం అందుకున్న కాకినాడ వన్‌టౌన్ పోలీసులు సీఐ నాగదుర్గారావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుడు పరారీలో ఉన్నట్టు సీఐ తెలిపారు.


శిశువు మృతదేహం

5న నన్నయలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు కౌన్సెలింగ్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాలకు ఈ నెల ఐదో తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే ఈ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు ఏపీ ఐసెట్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

పాముకాటుకు వ్యక్తి మృతి


మృతుడు లోవరాజు

కోటనందూరు: గ్రామంలో పశువుల పాక వద్ద మూగజీవాలకు గడ్డి వేసేందుకు వెళ్లిన జాగారపు లోవరాజు (35) సోమవారం రాత్రి పాముకాటుకు గురయ్యాడు. ఆ విషయం గమనించని లోవరాజు గంట తరవాత తల తిరుగుతున్నట్టు అనిపించి స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లి వైద్యం చేయించుకున్నాడు. పరిస్థితి విషమిస్తుండడంతో బంధువులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ వైద్య సిబ్బంది తుని ఏరియా ఆసుపత్రికి సూచించారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. లోవరాజు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

యువతి అదృశ్యంపై కేసు

గండేపల్లి: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు గండేపల్లి ఎస్సై యువి శివనాగబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి గ్రామానికి చెందిన షేక్ యాస్మిన్ (19) మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతు సమీపంలో ఉన్న అమ్మ హాస్టల్ ఉంటోంది. గత నెల 29న సాయంత్రం ఇంటికి వెళ్తున్నట్టు హాస్టల్ వార్డెన్‌కు చెప్పి ఇంటికి వెళ్లలేదు. ఆమె కోసం వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో తండ్రి షేక్ సత్తార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440904841 నంబర్‌కు తెలియజేయాలన్నారు.